# లూయిస్ బ్రెయిలీ జయంతి


బ్రెయిలీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చౌక్కరావు ఎమ్మెల్యే బాలూనాయక్

నల్లగొండ రూరల్,జనవరి 4: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ జయంతిని గొల్లగూడలోని సూరదాసు భవన్‌లో గురువారం నిర్వహించారు. డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చౌక్కారావు బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోయినపల్లి జగన్మోహన్‌రావు, పెండ్యాల దామోదర్ రావు, నాగులవంచ వెంకటేశ్వర రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమ అధికారి కార్యాలయంలో..

నీలగిరి: జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఆర్డీఓ కాళిందిని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంధ ఉద్యోగి బాలయ్యను సన్మానించారు.


హాలియాలో చిట్టిపోలు రాములమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ , ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్

# రాములమ్మకు ప్రముఖుల నివాళి

హాలియా, జనవరి 4 : జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి తల్లి చిట్టిపోలు రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం హాలియాలోని చైతన్య ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన సంతాప కార్యక్రమానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ హాజరై రాములమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ సలహాదారుడు ఆవుల పురుషోత్తం, నాయకులు యడవల్లి మహేందర్‌రెడ్డి, కేతావత్ భిక్షానాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, పోశం శ్రీనివాస్‌గౌడ్, రావుల లింగయ్య, చాపల సైదులు, అబ్దుల్ హలీం, అంజత్‌ఖాన్ పాల్గొన్నారు.

# ఆడపిల్లలను ఉన్నత స్థాయికి ఎదుగనివ్వాలి

- ఎంపీపీ శ్రీదేవీ



నకిరేకల్ : మాట్లాడుతున్న ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, పక్కన ఎంపీడీఓ రమేశ్‌దీన్‌దయాళ్

నకిరేకల్, జనవరి 4 : ఆడపిల్లలను ఉన్నతస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్‌రావు సూచించారు.మండలకేంద్రంలో గురువారం బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి మగవాడు స్త్రీ పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ దీన్ దయాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హాలియా, జనవరి 4 : అనుముల మండలం రామడుగు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భ్రమత (23) గురువారం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు గ్రామానికి చెందిన దొండేటి సైదిరెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పోస్టల్ శాఖలో ఉద్యోగి కాగా కూతురు భ్రమత బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నది. నెలలో 15 రోజులు ఆఫీసుకు వెళ్తుండగా మరో 15 రోజులు ఇంట్లోనే ఉండి వర్క్‌ఫ్రం హోం విధులు నిర్వహిస్తున్నది. గురువారం తల్లిదండ్రులు పొలం పనుల నిమిత్తం, అన్న ఉద్యోగానికి వెళ్లగా భ్రమత ఇంట్లో ఒంటరిగా ఉంది. ఏమైందో ఏమోగానీ భ్రమత ఇంట్లో రేకుల రాడ్డుకు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి సైదిరెడ్డి మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి రాగా కుమార్తె ఇంటి రేకుల ఐరన్ పైపునకు చున్నీతో వేలాడుతూ కనిపించింది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్


కొండమల్లేపల్లి : గ్రామసభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి, జనవరి 4 : ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేసి అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క దరఖాస్తులోనే పథకాలకు సంబంధించిన వివరాలు ఉండడంతో అవన్నీ ఒకే సారి అమలవుతాయన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, తాసీల్దార్ దివ్యారెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ సీరాజ్‌ఖాన్, ఉప సర్పంచ్ గంధం సురేశ్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, నాయినీ ప్రభాకర్‌రెడ్డి, అందుగుల ముత్యాలు, బక్కలయ్య, ఖైసర్‌ఖాన్, జగదీశ్ పాల్గొన్నారు.

## దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయాలి : ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

పెద్దవూర, జనవరి 4 : అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని నాగర్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాపాలనలో తీసుకున్న ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల నిడమనూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరి, కొత్తలూరు సర్పంచ్ నూలక శోభారమణారెడ్డి, నాయకులు గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, కర్ణ కార్తీక్‌రెడ్డి, రమేశ్, పగడల నాగరాజు పాల్గొన్నారు.



కట్టంగూర్ : కల్మెర గ్రామ ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

## ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్/చిట్యాల : అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూర్ మండలం కల్మెర, కురుమర్తి, చిట్యాల మండలం వెల్మినేడు గ్రామాల్లో గురువారం జరిగిన ప్రజాపాలనలో మాట్లాడారు. అభయహస్తం పథకంతో ప్రతి ఇంటికి లబ్ధిచేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, మండల నోడల్ అధికారి విజేయేందర్‌రెడ్డి, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ చిన వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ ధనమ్మ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ మండల సమావేశం

మర్రిగూడ,జనవరి 4 :మండల కేంద్రంలోని విజయ గార్డెన్స్‌లో శుక్రవారం బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య నాయకులు,కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్ తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమావేశానికి హాజరవుతారని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

## తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

శాలిగౌరారం, జనవరి 4 : తల్లి మందలించిందని కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన మండలంలోని పెర్కకొండారంలో గురువారం జరిగింది. శాలిగౌరారం ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మాచర్ల ఆండాలు కుమారుడు శ్రీకాంత్(27) కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో కొన్ని రోజులుగా రోజు మద్యం తాగి దుబారగా తిరుగుతుండగా తల్లి ఆండాలు మందలించింది. దాంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్ బుధవారం పంచాయతీ మోటర్ పెట్టి వస్తానని వెళ్లి అక్కడే పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. అక్కడే పడి ఉన్న శ్రీకాంత్‌ను అటుగా వెళ్తున్న వారు గమనించి సమాచారం గ్రామస్తులకు ఇచ్చారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ద్విచక్రవాహనంపై నకిరేకల్ దవాఖానాకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ పేర్కొన్నారు.

# సీఎంఓలో బీసీ అధికారులను నియమించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జాజుల లింగంగౌడ్


కళ్లకు గంతలు కట్టుకొని పూలే విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడటౌన్, జనవరి 4: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంలో బీసీ అధికారులను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సీఎంఓలో బీసీ అధికారులకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ సంఘం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని స్థానిక మహాత్మాజ్యోతిబాపులే విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కార్యాలయంలో అధికారుల నియామకంలో బీసీలకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో సమర్థులు ఉన్నప్పటికీ ఆయన వివక్ష చూపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, సైదులు, అంజి పాల్గొన్నారు.

# ఆధార్ కోసం అవస్థలు

## తెల్లవారుజాము నుంచే సెంటర్ల వద్ద క్యూ కడుతున్న జనం


దామరచర్ల ఆధార్ కేంద్రం వద్ద తెల్లవారుజామున నాలుగు గంటలకు వేచి ఉన్న వివిధగ్రామాల ప్రజలు

దామరచర్ల, జనవరి 4: ఆధార్‌కార్డుల అప్‌డేట్, కొత్త వారికి ఆధార్ కార్డు కోసం ప్రజల కుస్తీపట్లు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరుగ్యారెంటీలు, కొత్త రేషన్ కార్డు కోసం ఆధార్ కార్డు అవసరమై ఉండడంతో మండల కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రం వద్ద రద్దీ కొనసాగుతున్నది. దాంతో ఆధార్ కేంద్రం నిర్వాహకులు టోకెన్లు అందిస్తున్నారు. అయితే ముందుగా వచ్చిన వారికే ఆరోజుకు సంబంధించిన టోకెన్లు లభిస్తుండడంతో గ్రామాల ప్రజలు తెల్లవారుజామున 4 గంటలకే ఆధార్ కేంద్రానికి వచ్చి క్యూ కడుతున్నారు. చంటి పిల్లలతో వస్తున్న తల్లులు, వృద్ధులు, పిల్లలు చలికి వణుకుతూ ఇబ్బందులు పడుతున్నారు.